క్లుప్తంగా

కరణం వెంకటేష్‌ను కలిసిన మాగుంట తనయుడు


ఎమ్మెల్యేను కలిసిన పార్టీ నాయకులు

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని బుధవారం ఒంగోలులోని వారి నివాసంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి కలిశారు. ఆయనతో పాటు అన్నాబత్తిన ఘనశ్యామ్, తాత ప్రసాద్, బెల్లం సత్యం, గొర్రెపాటి శ్రీను ఉన్నారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థిక సాయం


వలంటీర్ విజయ్‌కు ఆర్థిక సాయం చేస్తున్న నరసింహారెడ్డి

జె.పంగులూరు: మండల పరిధిలోని బూద వాడ గ్రామానికి చెందిన వలంటీర్ ఇస్తర్ల విజయ్ తల్లి బుల్లెమ్మాయి (49) రెండు రోజులు క్రితం అనారోగ్యంతో చనిపోయింది. విషయం తెలుసుకున్న అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఆర్థిక సాయం అందించారు. పానెం శ్రీనివాసరెడ్డి, స్వయంపు హనుమంతురావు, పులికం కోటిరెడ్డి, తేళ్ళ నాగమ్మ, గాదె బ్రహారెడ్డి, గోపాల్‌రెడ్డి, బ్రహ్మరెడ్డి, సాయిబాబు తదితరులున్నారు.

ఐక్యతతో ప్రశాంతంగా జీవించండి

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజలు ఒకరికొకరు ఐక్యతతో ప్రశాంతంగా జీవించాలని సంతమాగులూరు సీఐ కె. నరసింహారావు కోరారు. నెల్లూరు జిల్లా నాయుడు పేట నుంచి బుధవారం బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టిన తదుపరి వేమవరంలో జరుగుతున్న పోలీస్ పికెట్‌ను, రికార్డులను, కేసుల వివరాలను ఎస్సై వి. వేమన నుంచి తెలుసుకున్నారు. 6 సంవత్సరాల క్రితం జంట హత్యలతో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు ఎస్సై వివరించారు. కక్షలు , కార్పణ్యాలకు తావివ్వరాదన్నారు. ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

నేడు సెయింట్ ఆన్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వాల్యు ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా కంపెనీచే క్యాంపస్ ఇంటర్వ్యూలు గురువారం నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈసీఈ, ఈఈఈ మెకానికల్ బ్రాంచిలో డిప్లమో పూర్తి కాబోతున్న విద్యార్థులు హాజరు కావచ్చుని తెలిపారు.

30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల అర్బన్: సంగీత సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలను ఈనెల 30 వ తేదీ నుంచి పంచాహ్నిక దీక్షతో సాంస్కృతిక సమితి చైతన్య భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రి బుధవారం తెలిపారు. స్థానిక ముంతావారి సెంటర్‌లోని ఎస్‌వీఎస్అండ్ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులు పాటు వివిధ ప్రాంతాల్లోని సంగీత విద్వాంసులచే త్యాగరాజ సంకీర్తనల కచేరీలు జరుగుతాయన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై మూడు రోజుల శిక్షణ

బల్లికురవ: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసేందుకు గురు, శుక్ర, శని వారాల్లో స్థానిక పరిషత్ కార్యాలయాల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఇంజినీరింగ్ డిజిటల్ అసిస్టెంట్‌లు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు గురు, శుక్రవారంలో రెండు రోజులు శనివారం మండల స్థాయి అధికారులు, సెక్రటరీలు, సచివాలయంలోని వివిధ శాఖలు వార్డు సభ్యులు, వీవోఏలకు శనివారం శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు 1 సచివాలయంలో శుక్రవారం ఉదయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. రెండు నెలల క్రితం జరిగిన మొదటివిడతలో చూపించుకున్న రోగులు కేస్‌షీట్‌తో శిబిరానికి రావాలన్నారు. అవసరం అయిన వారికి వివిధ రకాల పరీక్షలు మందుల పంపిణీతో శస్త్ర చికిత్సకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు పంపిస్తామని ఎంపీడీవో వివరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి


కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

● కార్యకర్తలకు, నాయకులకు ఎమ్మెల్యే బలరాం, ఇన్‌చార్జి వెంకటేష్‌లు సూచన

చీరాల: పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం ఒంగోలులోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం బలరాం, వెంకటేష్ మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ పరిపాలన జగన్‌మోహన్ రెడ్డి చేసి దేశంలో గుర్తింపును సాధించారన్నారు. అలానే రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన అనేక కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. ఎల్లో మీడియా, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సంబంధంలేని ఆరోపణలు చేస్తూ రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందంటూ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, నేతన్న నేస్తం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పడటంతో టీడీపీ మాయమాటలను ఎవరూ నమ్మడం లేదన్నారు. ఈ రోజు అవ్వా, తాతలు ఒకటవ తేదీనే ఇంటి వద్దనే వలంటీర్లతో మూడు వేల రూపాయల పింఛన్ తీసుకుంటున్నారని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చీరాల నియోజకవర్గంలో గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్ళలో జరిగిందన్నారు. అలానే రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, నాడు నేడు కింద పాఠశాలల అభివృద్ధి, రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతులు ఏర్పడ్డాయన్నారు. త్వరలోనే వాడరేవు–పిడుగురాళ్ళ రోడ్డు, వాడరేవు ఫిషింగ్ హార్బర్, వైకుంఠపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పార్టీ పట్టణ–1 అధ్యక్షులు కొండ్రు బాబ్జి, చీరాల రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, జేసీఎస్ ఇన్‌చార్జులు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సమన్వకర్త హనిమిరెడ్డి

వైఎస్సార్ సీపీలోకి వలసలు

అద్దంకి: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసల పర్వం ఊపందుకుంది. ఇటీవల సంతమాగులూరు మండలానికి చెందిన 200 వడియరాజుల కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరగా, తాజాగా మండలంలోని మోదేపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి సమన్వయకర్త పానెం చిన్న హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. వీరంతా గ్రామంలోని మద్దిరెడ్డి రమణారెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీటీసీ సుంకర శ్రీనివాసరెడ్డి, నల్లపనేని శ్రీనివాసరావు చౌదరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సమన్వకర్త మాట్లాడుతూ ఓన్నికల నాటికి టీడీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకని పరిస్థితి రాబోతోందన్నారు.

హుషారుగా ఆడుదాం ఆంధ్రా


బల్లికురవలో క్రికెట్ పోటీల్లో తలబడుతున్న గుంటుపల్లి - మల్లాయపాలెం జట్టు


పర్చూరు: ప్రథమ బహుమతి అందుకున్న నరసాయిపాలెం జట్టు

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను చేపట్టిందని ఈవోఆర్డీ దాసరి సుమతి అన్నారు. బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు బల్లికురవ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో బాలురు బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడా కారులను ఆమె పరిచయం చేసుకున్నారు. హుషారుగా పోటీల్లో పాల్గొని నువ్వానేనా అన్నట్లుగా తలపడ్డారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో కొణిదెన – వెలమవారిపాలెం మధ్య బాలురకు, కేజీ బీవీలో గుంటుపల్లి – మల్లాయపాలెం మధ్య బాలికలకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని నూతలపాడులో సత్రం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ఫైనల్ పోటీల్లో నరసాయిపాలెం, నూతలపాడు గ్రామాల క్రికెట్ జట్లు పోటీపడగా నరసాయిపాలెం జట్టు విజయం సాధించి మెదటి బహుమతిని కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిని నూతలపాడు, తృతీయ బహుమతిని దగ్గుపాడు జట్లు గెలుచుకున్నారు. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

మార్టూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీడీఓ జి. నితిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ రవి దేవరాజ్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూచేపల్లితో హనిమిరెడ్డి భేటీ


బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డితో పానెం చిన హనిమిరెడ్డి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంతమాగులూరు సీఐ నరసింహరావు


ఇన్‌చార్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అద్దంకి సీఐ కృష్ణయ్య

అద్దంకి రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను, దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను బుధవారం దర్శిలోని వారి స్వగృహంలో అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట అద్దంకి వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఇన్‌చార్జిని కలిసిన సీఐలు

అద్దంకి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంతమాగులూరు సీఐ కె. నరసింహరావు, అద్దంకి పీఎస్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి. కృష్ణయ్యలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పి. హనిమిరెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అంతకు ముందు సంతమాగులూరు సీఐగా నరసింహరావు, అద్దంకి సీఐగా పి. కృష్ణయ్య స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

చిన హనిమిరెడ్డిని కలిసిన దళిత సంఘాల నాయకులు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డితో బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ముఖాముఖి నిర్వహించారు. ఈనెల 19న విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న 125 అడుగుల అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప సభ గురించి చర్చించారు. దళిత సంఘాలకు కావాల్సిన సహాయసహకారాలు అందిస్తానని సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి తెలిపారు. స్వర్ణ సోని, పూనూరి నరేంద్ర, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


దళిత సంఘ నేతలతో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

ఘనంగా భావనారుషి నగరోత్సవం


గజవాహనంపై ఊరేగుతున్న భావనారుషి స్వామి


నగరోత్సవంలో విచిత్రవేషధారణలు

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారు వద్ద వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై పట్టణంలో ఊరేగించారు. స్వామి వారి పెద్ద సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరోత్సవాన్ని మంగళవాయిద్యాలతో, విచిత్ర వేషధారణలతో వైభవంగా జరిపించారు. అనంతరం ఎదురుకోల ఉత్సవం, కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.

ఓటు వినియోగంపై అవగాహన

జె.పంగులూరు: రోబోవు సార్వత్రి ఎన్నికల్లో ఈ సంవత్సరం అధిక సంఖ్యలో యువతకు ఓటు హక్కు వచ్చింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా ఓటు వచ్చిన వారికి యంత్రాలపై ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. మండలానికి రెండు బృందాలుగా విడిపోయి రామకూరు, భగవాన్ రాజుపాలెం, కొండ మంజులూరు, కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాల్లో కె. పోతురాజు బృందం సభ్యులు అవగాహన కల్పించారు. చిన్నమల్లవరం, పంగులూరు, కోటపాడు, కొండమంజులూరు, బైటమంజులూరు గ్రామాల్లో శ్రీనివాసరావు బృందం పర్యటించి అవగాహన కల్పించారు.


పంగులూరులో యువతకు ఓటు మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హెచ్‌ఎం బెనర్జీ మృతి


వి. బెనర్జీ

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ మొయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న వి. బెనర్జీ (61) బుధవారం మృతి చెందారు. ఈయన 1986వ సంవత్సరం నుంచి ఎయిడెడ్ ఉపాధ్యాయునిగా, అనంతరం కారంచేడులో ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేసే క్రమంలో ఈయన కూడా ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఏడాది కాలం నుంచి ఈయనకు అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. దీంతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు చీరాలలోని ఆయన స్వగృహంలో ఉంచిన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఈవీఎం, వీవీ పాట్‌లపై అవగాహన

యద్దనపూడి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రక్రియలో భాగంగా ఈవీఎం, వీవీపాట్‌లపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు రవికుమార్ అన్నారు. బుధవారం సూరవరపుపల్లి , యనమదల, అనంతవరం గ్రామాల్లో ఈవీఎం, వీవీ పాట్‌లపై ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలి, వేసిన ఓటు ఏ విధంగా చూసుకోవచ్చు అన్న అంశంపై మాక్ పోలింగ్ నిర్వహించారు. డీటీ విష్ణు ప్రసాద్, ఎస్‌ఏ టి. భాస్కర్‌రావు, వీఆర్వోలు శేషుబాబు, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అద్దంకిలో వైఎస్సార్ సీపీదే గెలుపు


జెండా ఆవిష్కరిస్తున్న అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వచ్చే ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో పల్లెపల్లెకు హనిమిరెడ్డి అన్న కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వచ్చిన సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డికి గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో భారీగా స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో అన్ని సేవలు ఇంటివద్దనే అందుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకూ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంతమాగులూరు మండల కన్వీనర్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహక అవార్డులు


అవార్డుల అందుకున్న వారితో రోటరీ క్లబ్ సభ్యులు

వేటపాలెం: వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన వారి ప్రతిభకు పోత్సాహాన్ని అందించడానికే అవార్డ్స్ ప్రదానం చేశామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో ఒకేషనల్ అవార్డ్స్ బుధవారం ప్రదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ రోటరీ అంటేనే సేవచేయడం ప్రధాన ధ్యేయం అన్నారు. సంఘ సేవకురాలు, విశ్రాంత అధ్యా పకురాలు కొసనం నాగమాంబ, సినీ మేకప్ ఆర్టిస్ట్ బుద్ది వీరప్రసాద రావు, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ గొరాబత్తుని రావిబాబు, సినీ నటుడు ప్రత్తిపాటి అజయ్‌ఘోష్, సినీ డైరెక్టర్ పిచ్చుక సుబ్రహ్మణ్యం, బహుగ్రంథ రచయిత చల్లా రామారావు, ఎస్‌బీఐ ఉద్యోగి రెడ్డి కృష్ణచైతన్య, కో–ఆప్‌టెక్స్ రీజినల్ మేనేజర్ యజ్ఞనాగేంద్రప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ ఎ.వి. కృష్ణారెడ్డి, జర్నలిస్ట్ దగ్గుమాటి శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్‌కుమార్, దగ్గు బాటి శ్రీవల్లి కలిసి 16 మందిని ఘనంగా సన్మానించి ఒకేషనల్ అవార్డ్స్ అందజేశారు. క్లబ్ కార్యదర్శి ఏవీ సురేష్‌బాబు, రోటేరియన్ గొల్లపూడి సీతారాం, విశ్వంబరానందగిరి స్వామి, రోటేరియన్ నాగేంద్రబాబు, పత్తి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

మార్టూరు: ప్రభలు, పాట కచేరీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామం కోలాహలం మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బుధవారం సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా కనుమ పండగ మరుసటి రోజు పూర్వకాలం నుంచి గ్రామంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్న తెప్పోత్సవానికి పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున గాజరయ్యారు. స్థానిక రామాలయంలోని ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి గ్రామానికి తూర్పు వైపు గల చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామ సెంటరులో ఎలక్ట్రికల్ లైటింగ్‌తో ఏర్పాటు చేసిన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వృద్ధాశ్రమానికి టీవీ వితరణ


దుస్తులు, టీవీ బహూకరిస్తున్న దాతలు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరులో సీకేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు షరీఫ్‌కి బుధవారం టీవీ అందించారు. పంగులూరు గ్రామానికి చెందిన ప్రశాంత్, ప్రవీణ్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు రాయిణి రమారావు, భారతీ ఎల్ఈడీ టీవీని బహూకరించారు. పంగులూరు గ్రామానికి చెందిన గుర్రం ఆంజనేయులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై సి.హెచ్. కొండయ్య తెలిపిన వివరాల మేరకు చీరాల–చినగంజాం రైల్వే స్టేషన్ల మధ్య దిగువ లూప్ లైన్ రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని, మృతుడు రైలు బండిని గమనించకుండా రైలు పట్టాలను దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.